

చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,310
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,297
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,500
రిటైల్ వెండి గ్రాము	రూ.71.50

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	18
తిరుపతి	34	19
తిరుమల	29	15
గూడూరు	34	20
నగరి	34	19



క్షీరాభిషేకం

ఆలయాల పాలక మండలిలో చోటు కల్పించడంపై నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్త చేస్తూ మంగళవారం తిరుపతిలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. - తిరుపతి కల్చరల్

న్యూస్‌రీల్

సంతృప్తిగా దర్శనం చేయించండి



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్: శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా దర్శనం కలిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కాణిపాకం దేవస్థానం అభివృద్ధిపై కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు విచ్చేస్తారని, వారికి సంతృప్తిగా దర్శన భాగ్యం కల్పించేలా పకడ్బందీ చర్యలు అమలు చేయాలన్నారు. భోజనం, వసతి సదుపాయాలను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. వాహనాల పార్కింగ్‌కు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. చిత్తూరు ఆర్డీఓ రేణుక, కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేశు, డీపీఓ లక్ష్మి పాల్గొన్నారు.

కోడిపిల్లల పరిశ్రమ పరిశీలన



కోడిపిల్లలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

పలమనేరు : మండలంలోని మొరం వద్ద వెంకటేశ్వర హ్యాచరీస్ పరిశ్రమను కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం పరిశీలించారు. కోడిగుడ్లు ఎక్కడినుంచి తెప్పిస్తారు,ఎలా పొదగబెడతారు, పిల్లలను ఎవరికి సరఫరా చేస్తారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పౌల్ట్రీ నిర్వాహకులకు కోడి పిల్లలను ఎంత ధరకు విక్రయిస్తారు, రైతుకు ఎంత గిట్టుబాటవుతుందని ఆరా తీశారు. దీనిపై పరిశ్రమ ఏజీఎంలు నారాయణస్వామి రెడ్డి, దొరస్వామి రెడ్డి మాట్లాడుతూ నెలకు సుమారు 34లక్షల బ్రాయిలర్ పిల్లలను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఫార్మర్స్ ఇంటిగ్రేటెడ్ విధానం ద్వారా రైతులకు పిల్లలను ఇచ్చి అవి పెరిగాక కిలో రూ.6.50 పైసలు చొప్పున తామే కొనుగోలు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి వెంకట్రావు, ఏడీలు ఆసిఫ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఫార్మేటివ్ అసెస్‌మెంట్-3

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో మంగళవారం ఫార్మేటివ్ అసెస్‌మెంట్-3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించారు. ఈ పరీక్షలను డీవైఈఓ, ఆయా మండలాల ఎంఈఓలు పర్యవేక్షించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ విజయేంద్రరావు హెడ్‌మాస్టర్లను ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై దర్లో మాట్లాడుతూ రోజూ ఒకటి నుంచి పదో తరగతి వరకు ఎఫ్‌ఏ-3 పరీక్షల ప్రశ్నపత్రాలను మండల కేంద్రం నుంచి పంపిణీ చేయాలన్నారు. ఓఎంఆర్‌లో విద్యార్థులు సమాధానాలు గుర్తించవలసి ఉంటుందని చెప్పారు. ఈ నెల 10వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి మంగళవారం ఆదేశించారు. బుధవారం నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించాలని తెలిపారు. 14న దరఖాస్తుల పరిశీలన, 15వ తేదీన కమిటీ నేతృత్వంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు.

హాయివే!

జిల్లాలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజలు సురక్షితంగా.. సుఖవంతంగా ప్రయాణం సాగించేలా రోడ్లు నిర్మిస్తోంది. తొలుత పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిని పూర్తి చేసింది. అత్యాధునిక హంగులతో సువిశాలంగా సిద్ధం చేసిన రోడ్డును జాతికి అంకితం చేసింది. దీంతో తిరుపతి– చిత్తూరు నడుమ ప్రయాణం మరింత సులభతరంగా మారింది. ప్రయాణికులు ఎలాంటి అవరోధాలు.. ఆలస్యం లేకుండా హ్యాపీగా జర్నీ చేసే వెసులుబాటు వచ్చింది. అలాగే బెంగళూరు–చెన్నై.. చిత్తూరు– తచ్చూరు హైవేల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. మరిన్ని పట్టణాలకు అనుసంధానం చేస్తూ ప్రణాళికాబద్ధంగా రోడ్డు మార్గాలను విస్తరిస్తోంది. జిల్లాలో రవాణా సౌకర్యం మెరుగుపడడంతో పరిశ్రమల స్థాపనకు సైతం అనుకూలంగా మారింది.

- పూర్తయిన పూతలపట్టు– నాయుడుపేట హైవే
- సంతోషంగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు
- శరవేగంగా మరో రెండు జాతీయ రహదారుల నిర్మాణం
- జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా రోడ్డు కనెక్టివిటీ



పీఎస్‌రోడ్డులో భాగమైన చిత్తూరు- తిరుపతి మార్గం

సాక్షి, చిత్తూరు : జిల్లాలో పూతలపట్టు– నాయుడుపేట ఆరు వరసల హైవే పనులు పూర్తయ్యాయి. చిత్తూరు నుంచి తిరుపతికి వెళ్లేందుకు రోడ్డు ప్రయాణం సులువుగా మారింది. సమయం కూడా దాదాపు గంట ఆదా అవుతోంది. అలాగే తమిళనాడు, కర్ణాటక నుంచి తిరుమలకు వెళ్లే భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటోంది. ఈ రహదారికి అనుసంధానంగా పలమనేరు నుంచి అటు పుంగనూరు, ఇటు కుప్పం వరకు రోడ్డు సిద్ధమైంది.

జిల్లాలో 200 కిలోమీటర్ల రహదారులు

జిల్లాలో సుమారు 200 కిలోమీటర్ల మేర మూడు జాతీయ రహదారులు నిర్మిస్తున్నారు. ఇప్పటికే పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చింది. ఇక బెంగళూరు, చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే పనులు వేగంగా సాగుతున్నాయి. చిత్తూరు-తచ్చూరు మార్గానికి ఇప్పటికే భూసేకరణ పూర్తయింది. అన్ని రోడ్లు అందుబాటులోకి వస్తే జిల్లాలోని నగరాలు, పట్టణాలు, పల్లెలకు కనెక్టివిటీ మరింత పెరగనుంది.



ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో భాగంగా ఫ్లై ఓవర్ పిల్లర్ల నిర్మాణం

రూ.3,958.5 కోట్లతో చిత్తూరు–తచ్చూరు రహదారి

చిత్తూరు– తచ్చూరు హైవే జిల్లాలో సుమారు 75 కిలోమీటర్ల వరకు వెళ్లనుంది. గుడిపాల, గంగాధర నెల్లూరు , శ్రీరంగరాజపురం, నగరి, నింద్ర, విజయపురం మండలాల మీదుగా తమిళనాడులోకి ప్రవేశిస్తుంది. సుమారు రూ.3,958.5 కోట్ల వ్యయంతో 197 అడుగుల వెడల్పున ఈ రహదారి ఏర్పాటు కానుంది. 2024 అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో శరవేగంగా పనులు చేపడుతున్నారు.

పరిశ్రమలకు అనుకూలం

బెంగళూరు-చెన్నై మహానగరాలకు మూడు హైవేలతో రోడ్డు కనెక్టివిటీ పెరగడంతో పరిశ్రమల స్థాపనకు జిల్లా అనుకూలంగా మారింది. రాబోయే కాలంలో పారిశ్రామిక ప్రగతి భారీగా పెరగనుంది. ముఖ్యంగా ఎక్స్‌ప్రెస్ హైవేకు ఇరువైపులా పలు పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. ఇందుకోసం అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. పరిశ్రమలు స్థాపించే వారికి వెంటనే అనుమతులు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఈ మార్గాల్లో కోసల నగరం, గంగ్రాజుపల్లె, పుంగనూరు, చిత్తూరు, గుడిపాలలో పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి.

రూ.4,259 కోట్లతో ఎక్స్‌ప్రెస్ హైవే

చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే జిల్లా మీదుగా వెళ్లనుంది. మొత్తం రూ.4,259 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో సుమారు 80 కిలోమీటర్ల వరకు జిల్లాలోనే రోడ్డు నిర్మిస్తున్నారు. ప్రధానంగా వి.కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు, బంగారుపాళ్యం, యాదమరి, చిత్తూరు, గుడిపాల మీదుగా తమిళనాడులోకి వెళ్లే ఈ మార్గంలో రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 295 అడుగుల వెడల్పు, 8 అడుగుల ఎత్తు ఉండేలా ఈ హైవే నిర్మాణం చేపట్టారు.అలాగే బైరెడ్డిపల్లె, గుడిపాల వద్ద ప్యాసేజ్ రోడ్లు సైతం ఏర్పాటు చేయనున్నారు.

భూసేకరణ పూర్తి



చిత్తూరు మీదుగా వెళ్లనున్న జాతీయ రహదారులకు సంబంధించి భూ సేకరణ పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పరిహారం సైతం చెల్లించేశాం. నేషనల్ హైవే అథారిటీస్ వారికి భూమిని కూడా అప్పగించేశాం. ప్రస్తుతం రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. – రేణుక, ఆర్డీఓ, చిత్తూరు

శరవేగంగా నిర్మాణం



చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే, చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేసి అప్పగించింది. ప్రస్తుతం ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. మరో ఏడాదిలోపు అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. – కార్తీక్‌రెడ్డి, హైవే పీడీ, చిత్తూరు డివిజన్

పారిశ్రామికాభివృద్ధికి అనుకూలం



చిత్తూరు-తచ్చూరు హైవే పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్ (ఫైల్)

జిల్లాకు వచ్చిన మూడు జాతీయ రహదారులు అందుబాటులోకి వస్తే పారిశ్రామికాభివృద్ధికి మరింత అనుకూలంగా ఉంటుంది. ఆయా మార్గాల్లో ఇప్పటికే పరిశ్రమల స్థాపనకు తీసుకోవాల్సిన చర్యలపై పకడ్బందీగా కసరత్తు చేశాం. కంపెనీలు నెలకొల్పేందుకు వచ్చేవారికి త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తున్నాం. – హరినారాయణన్, కలెక్టర్, చిత్తూరు

జీఎన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



జీఎన్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం : గ్రామీణుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన ఐఆర్‌ఆర్‌ఎం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు జీఎన్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. మంగళవారం పట్టణంలోని వైఎస్ జేమ్స్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రాంగణంలో జీఎన్ రెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 60 దేశాల్లో సామాజిక సేవలందించిన జీఎస్ రెడ్డి జిల్లాలోని పులిచెర్లలో జన్మించడం గర్వకారణమన్నారు. వెనుకబడిన ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలో ప్రజల స్థితిగతులను మెరుగుపరిచేందుకు విజలాపురంలో 1979వ సంవత్సరం ఐఆర్‌ఆర్‌ఎం స్వచ్ఛంద సంస్థను స్థాపించారని తెలిపారు. వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారని, ఎందరో పేదల ఆర్థికాభివృద్ధికి సాయం చేశారని వెల్లడించారు. 1965లో తిరుపతి వ్యవసాయ వర్సిటీలో పట్టా పొంది, రైతుల అండగా నిలిచిన దార్శనికుడు జీఎస్ రెడ్డి అన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఎలా పనిచేయాలో మార్గనిర్దేశం చేసిన మహనీయుడన్నారు. కుప్పంలో పాలిటెక్నిక్ కళాశాలకు సైతం ఆయనే స్థలం వితరణగా అందించారని గుర్తుచేశారు. అంతటి మహామనీషితో కలిసి పనిచేయకపోయినా, నేడు ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిచడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ్, ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, వన్నెకు క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వనిత పాల్గొన్నారు.



ఏఎంసీ చైర్మన్‌ను అభినందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మార్కెట్ కమిటీ పనితీరుకు ప్రశంస

పలమనేరు : పన్ను వసూలు, లక్ష్యాలను అధిగమించడంలో రాయలసీమలోనే ప్రథమ స్థానం దక్కించుకున్న పలమనేరు మార్కెట్ కమిటీకి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభినందనలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్, కార్యదర్శి సంజీవ్‌కుమార్, కమిటీ సభ్యులు, సిబ్బంది పనితీరును ప్రశంసించారు. మంగళవారం కుప్పం పర్యటనకు వెళుతూ మార్గం మధ్యలో శివునికుప్పం మ్యాంగో మార్కెట్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రైతులకు అండగా నిలుస్తూ, మార్కెట్ కమిటీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్, ఏఎంసీ వైస్ చైర్మన్ పుష్పలత ఆంజనేయులు, ఎంపీపీ యువరాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైబైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, పార్టీ కుప్పం పరిశీలకుడు మొగసాల రెడ్డెప్ప, నాయకులు జయరామిరెడ్డి, మండీ సుధా, డైరెక్టర్లు ఎమ్మార్ వేణు, నారాయణరెడ్డి, వీణ, సుబ్రమణ్యం, ఎర్రబెల్లి శ్రీనివాసులు, పర్యవేక్షకులు జ్ఞానాంభ, రత్నమ్మ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలం



ప్రభుత్వ పథకాలతో చేకూరిన లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. మంగళవారం మండలంలోని తాటిమాకులపల్లె, దిగువ తాటిమాకులపల్లె రామిరెడ్డిగారిపల్లె, ఎగువశెట్టివానత్తం గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. మహిల ఆర్థిక స్వావలంబనకు విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టారని వెల్లడించారు. మహిళల రక్షణకు దిశ చట్టంతో భరోసా కల్పించారన్నారు. టీడీపీ నేతలకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తుంటే, ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేస్తోందని ఆరోపించారు. టీడీపీ పాలనలోజన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేశారని విమర్శించారు. అనంతరం శెట్టివానత్తం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మమేకమయ్యారు. జగనన్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయులురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆదిలక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసహనంతోనే లోకేష్ వ్యాఖ్యలు



విలేకర్లతో మాట్లాడుతున్న కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, హరిణిరెడ్డి,శోభ

చిత్తూరు కార్పొరేషన్ : యువగళం పాదయాత్రకు జనం నుంచి స్పందన లేకపోవడంతోనే నారా లోకేష్ అసహనంతో అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లు తెలిపారు. మంగళవారం చిత్తూరులోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు 50శాతం కేటాయించిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. కనీసం ఎమ్మెల్యేగా గెలవని లోకేష్ రానున్న ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకువస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకోకుండా వాకింగ్ లాగా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సొంత సెక్యూరిటీ మినహా పాదయాత్రలో ప్రజలు పాల్గొనడం లేదన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, హరిణిరెడ్డి, శోభ పాల్గొన్నారు.

బాబు ఏమార్చితే.. జగనన్న నెరవేర్చారు!

- మంత్రి ఆర్‌కే రోజా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : ప్రజలను చంద్రబాబు ఏమార్చితే.. ఇచ్చిన హామీలన్నీ జగనన్న నెరవేర్చారని మంత్రి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నేతలను చీపుర్లతో కొట్టండి అంటూ లోకేష్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మల అప్పులు రూ.14600 కోట్లు మాఫీ చేస్తామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చి బ్లాక్ లిస్ట్‌లోకి తోసేసిన చంద్రబాబును మహిళలు కొడతారు కానీ, ఆ అప్పు రూ.24వేల కోట్లకు పెరిగినా మాఫీ సొమ్ము అందిస్తున్న జగనన్నను సహోదరునిగా ఆరాధిస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను శిథిలావస్థలోకి నెట్టిన చంద్రబాబును, లోకేష్‌ను పిల్లల తల్లిదండ్రులు కొడతారు కానీ, సర్కారు బడులను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దిన జగనన్నను తమ ఇంటిబిడ్డలా చూసుకుంటారన్నారు. రూ.86,600 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని చెప్పి పంగనామాలు పెట్టిన చంద్రబాబును రైతులు కొడతారు కానీ, వ్యవసాయాన్ని పండుగలా మార్చి, అన్నదాతలను ఆదుకుంటున్న జగనన్నకు అండగా నిలుస్తారని చెప్పారు. ఏటా 5 లక్షల మందికి ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఏమార్చిన వారికి దెబ్బలు పడతాయా.. 32 లక్షల మందికి పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తున్న వారికి దెబ్బలు పడతాయా..తెలుసుకోలేని అవివేకి లోకేష్ అని విమర్శించారు. అరకిలోమీటరు కూడా నడవడం చేతగాక వంకర టింకర్లు పోతున్న లోకేష్, 3,600 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన జగనన్న గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైనాట్ 175 అంటూ సింహంలా వస్తున్న జగనన్న ముందు 175 మందిని పోటీచేయించడానికి కూడా సత్తా లేక సతమతమయ్యే చంద్రబాబు తేలిపోవడం ఖాయమని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

శ్రీరంగరాజపురం : మండలంలోని పిల్లారి కుప్పం గ్రామంలో మునస్వామిరెడ్డి అనే వ్యక్తిని ఆదివారం సాయంత్రం హత్య చేసిన కేసులో నిందితుడు కృష్ణమూర్తిని అరెస్టు చేసినట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ షేక్షావలీ తెలిపారు. వారు మాట్లాడుతూ మంగళవారం ఉదయం 11 గంటలకు పిల్లారికుప్పం క్రాస్ వద్ద సంచరిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

స్కూల్ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయపడిన యువకులు

గంగాధరనెల్లూరు : మండలంలోని ఎల్లమరాజు పల్లె మలుపు వద్ద మంగళవారం ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. నెల్లేపల్లి కొత్తూరుకు చెందిన ధనశేఖర్, రోహిత్ ద్విచక్ర వాహనంపై చిత్తూరు వైపు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటాచలం తెలిపారు.

- తిరుపతిలో నివాసం ఉంటున్న వ్యక్తికి నంద్యాల జిల్లా ఓర్వకల్లులో స్థిరాస్తి ఉంది. ఆ స్థిరాస్తిని విక్రయించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. డాక్యుమెంట్ ఐడీ నంబర్ 1-344-2023-1 ఆ కాపీని నంద్యాల జిల్లా ఓర్వకల్లు పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి స్కాన్ చేసిన పేపర్‌ను ఆన్‌లైన్ ద్వారా పంపారు. ఆ కాపీలో వివరాలు సరిగా లేవు 'రిజక్ట్' అని తిప్పి పంపారు.
- తిరుపతి రూరల్‌లో ఉన్న ఒక వ్యక్తి తన స్థిరాస్తిని తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. డాక్యుమెంట్ ఐడీ నంబర్ 1-261-2023-1 రిజిస్ట్రేషన్ కాపీని ఆన్‌లైన్ ద్వారా రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపారు. స్కాన్ కాపీలో వివరాలు సరిగా కనిపించడం లేదంటూ తిరస్కరించారు. మరోసారి ప్రయత్నం చేసినా..అదే సమాధానం.
- భారతి అనే మహిళ నుంచి విశ్వనాథరెడ్డి అనే వ్యక్తి అర్ధ ఎకరా వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. ఇది కమర్షియల్ ల్యాండ్ అని సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించారు. ఇదే సర్వే నంబర్‌లో మరో అర్ధ ఎకరం భూమిని అదే సబ్ రిజిస్ట్రార్ వ్యవసాయ భూమి కింద రిజిస్ట్రేషన్‌చేసి ఇచ్చారు.



ఎనీవేర్.. డోంట్ కేర్

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు అధికారుల దందా
- ఎనీవేర్ పేరుతో ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్న ప్రభుత్వం
- కాసుల కోసం కొర్రీలు పెట్టి పెండింగ్ పెడుతున్న వైనం
- అ'ధనం'గా చెల్లించిన వారి భూములు, స్థలాలకు మాత్రం రిజిస్ట్రేషన్
- కమర్షియల్ స్థలాలను సాగు భూముల కింద చూపించి వసూళ్లు
- పక్కన రోడ్డు, వెంచర్లు ఉన్నాయంటూ రిజిస్ట్రేషన్ చేయని అధికారులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు అధికారుల కాసుల కక్కుర్తికి ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. అందుబాటులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం సేవలను సులభతరం చేసేందుకు తీసుకొచ్చిన 'ఎనీవేర్' విధానానికి తూట్లు పొడుస్తున్నారు. అధిక మొత్తంలో కాసులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్ చేసినా... అప్రూవల్ చేయాల్సిన అధికారి నిలిపివేస్తున్నారు. స్కాన్ కాపీ సరిగా లేదని, మార్కెట్ విలువ తక్కువగా ఉందని ఏదో ఆశిస్తూ తిరస్కరిస్తున్నట్లు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్ : 'ఎనీ వేర్' అనే విధానానికి నిబంధనల సాకుతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు అధికారులు ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారు. కాసులకు కక్కుర్తిపడి రకరకాల కొర్రీలు పెట్టి భూములు, స్థలాలు, తాకట్టు, బదిలీ రిజిస్ట్రేషన్లను పక్కనపెడుతున్నారు. కాసులు ముట్టజెబితే పక్కన పెట్టిన వాటిని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ప్రజల సౌకర్యం కోసం రిజిస్ట్రేషన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. స్థిరాస్తులు ఎక్కడ ఉన్నా.. తనకు అందుబాటులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం సేవలను సులభతరం చేసింది. 'ఎనీ వేర్' అనే విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ విధానంతో ప్రజలకు సమయం, ప్రయాణం ఖర్చులు ఆదా అవుతుంది. దీన్ని మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం ప్రయోగాత్మకంగా కొన్ని గ్రామ సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే.

ఆ భూముల రిజిస్ట్రేషన్‌పై విచారణ

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో సుమారు 189 ఎకరాల కమర్షియల్ భూములను సాగు భూముల కింద రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వానికి చెందాల్సిన ఆదాయాన్ని మాత్రం అధికారులు జేబులు నింపుకున్నారు. ఈ విషయమై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. స్పందించిన ప్రభుత్వ ఉన్నతాధికారులు సంబంధిత రిజిస్ట్రార్‌ని వివరణ అడిగారు. తప్పైంది.. మరోసారి తప్పు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటానని రాతపూర్వకంగా ఆ అధికారి వివరణ ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఆ భూముల రిజిస్ట్రేషన్‌పై ఉన్నతాధికారులు గోప్యంగా విచారణ చేస్తున్నట్లు అమరావతికి చెందిన ఒక అధికారి సమాచారం.

అంతా కుమ్మక్కు?

ప్రభుత్వం ఎనీవేర్ విధానంతో రిజిస్ట్రేషన్లను సులభతరం చేయడం కొందరు అధికారులకు మింగుడుపడలేదు. అయితే ఈ విధానాన్ని వ్యతిరేకించలేని పరిస్థితి. దాంతో కొందరు సబ్ రిజిస్ట్రార్లు తిరుపతిలో రహస్య సమావేశం ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఎక్కడి స్థిరాస్తి అయినా రిజిస్ట్రేషన్‌కు వస్తే చేయాలని, అయితే ఆ దస్తావేజు రిజిస్ట్రేషన్ అప్రూవల్ కాకుండా పెండింగ్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అలా పెండింగ్ పెట్టి ఒకటికి నాలు పర్యాయాలు తిప్పుకుంటే... వారే దారిలోకి వస్తారని చర్చ జరిగినట్లు సమాచారం. ఆ తరువాత నగదు డిమాండ్ చేసి తీసుకుని ఎవరి వాటా వారు పంచుకుందామని నిర్ణయించి ఇలా చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

> **ఎనీవేర్‌కు అందరూ సహకరించాలి**
>
> ప్రభుత్వం తీసుకొచ్చిన ఎనీ వేర్ విధానాన్ని అందరూ అమలు చేయాల్సిందే. ప్రజలకు సహకరించాలి. అలా ఎక్కడైనా చేయకపోతే తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం.
>
> – గిరిబాబు, డీఐజీ, ఉమ్మడి చిత్తూరు జిల్లా

---

20 టన్నుల బియ్యం పట్టివేత


సీజ్ చేసిన లారీ, నిందితులతో పోలీసులు

పూతలపట్టు: ప్రభుత్వ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు సీజ్ చేశారు. పూతలపట్టు ఎస్ఐ హరిప్రసాద్ వివరాల మేరకు.. మంగళవారం ఉదయం 8 గంటలకు తిరుపతి–బెంగళూరు జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. అదే సమయంలో అనుమానాస్పదంగా అటు వైపు వెళ్తున్న లారీని నిలిపి తనిఖీ చేయగా అందులో 20 టన్నుల ప్రభుత్వ బియ్యం ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నగరి మండలానికి చెందిన లారీ డ్రైవర్ దామోదరం, క్లీనర్ కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతోపాటు నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బంగారుపాళెం: అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. ఆయన కథనం.. డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని మొగిలి ఘాట్ వద్ద తనతో పాటు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి, సిబ్బంది వాహనాలు తనిఖీ చేపట్టారు. పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న ఇన్నోవా కారు, కారు ముందు వెళ్తున్న ద్విచక్రవాహన దారుడిని ఆపి తనిఖీ చేయగా.. కారులో 3,744 (36 కేసులు) కర్ణాటక మద్యం ప్యాకెట్లు గుర్తించారు. కారు, ద్విచక్ర వాహనంసహా మద్యం ప్యాకెట్లను స్వాధీనం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ 8.35 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న గుడిపాల మండలం, పిళ్లారి కుప్పం గ్రామానికి చెందిన చెందిల్‌కుమార్(29), గొల్లమడుగు గ్రామానికి చెందిన సురేష్‌రెడ్డి(28)ని అరెస్ట్ కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన పేర్కొన్నారు.

శాస్త్రోక్తం.. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

- 11నుంచి శ్రీనివాసమంగాపురంలో బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈనెల 11 నుంచి 19వ తేదీ వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామాగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, కుంకుమ, గంధం పొడి, పచ్చాకు, గడ్డ కర్పూరం, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా సంప్రోక్షణ చేశారు. అనంతరం భక్తులకు సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్,సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పరదాల విరాళం

స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతికి చెందిన పరదాల మణి రెండు పరదాలు, రెండు కరాశాలలను ఆలయ అధికారులకు విరాళంగా అందజేశారు.

మార్చిలోపు శ్రీనివాస సేతు పనులు పూర్తి


శ్రీనివాస సేతు పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా : రేణిగుంట – తిరుచానూరు మ్యాంగో మార్కెట్ వరకు జరుగుతున్న శ్రీనివాస సేతు వంతెన పనులు మార్చినెలాఖరు లోపు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. ఆమె మంగళవారం శ్రీనివాస సేతు పనుల పురోగతిపై ఇంజినీరింగ్, అఫ్కాస్, ఏఈకామ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం రేణిగుంట రోడ్డులోని రామానుజ కూడలి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎక్కువ మంది కార్మికులను నియమించి గడువు లోపు పనులు పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి లోపు రేణిగుంట, తిరుచానూరు రోడ్డులో జరుగుతున్న ర్యాంపు పనులు పూర్తి చేయాలన్నారు. మార్చి నెలాఖరుకు శ్రీనివాససేతు మీద వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో ఆలస్యమైతే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతిరోజూ పనులను పరిశీలించి పురోగతి సాధించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఎస్ఈ మోహన్, ఎంఈ 1 చంద్రశేఖర్, డీఈ మోహన్, అఫ్కాస్ ప్రతినిధి రంగస్వామి, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన

అనంతరం కమిషనర్ తుడా మార్గంలో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు. పనుల ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు.

వెలవెలబోయిన యువగళం సభ


సభా ప్రాంగణంలో పలుచగా జనం

చిత్తూరు అర్బన్: యువగళం పాదయాత్రలో భాగంగా చిత్తూరులో మంగళవారం నిర్వహించిన సభకు జనం నుంచి స్పందన అంతంతమాత్రంగా కనిపించింది. జనం పెద్దగా రాకపోవడంతో కుర్చీలు చాలా వరకు ఖాళీగా కనిపించాయి. నారా లోకేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండ చూసుకుని జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెచ్చిపోతున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో అభివృద్ధి స్తంభించిందని, ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడంలేదని, బ్రాండెడ్ మద్యం దొరకడం లేదని ఆరోపించారు. చిత్తూరులో ఎమ్మెల్యే శ్రీనివాసులు, అతని అన్న కుమారుడు కలిసి రూ.500 కోట్ల విలువైన భూములు దోచుకున్నారని, సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల్లో 20 శాతం వరకు కమీషన్లు దండుకుంటున్నారని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే చిత్తూరులో యూనివర్సిటీతోపాటు ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

అంతా మీ వల్లే!

'చిత్తూరులో యువగళం ఫ్లాప్ అవ్వడానికి మీరే కారణం. ఇన్నేళ్ల పాటు పార్టీకి మీరు చెప్పిందే వేదమనుకున్నాం. కానీ ఇప్పుడే తెలుస్తోంది. మీ ఇద్దరినీ తప్పిస్తేనే పార్టీ బతుకుందని.' అంటూ ఇద్దరు సీనియర్ నాయకులపై లోకేష్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మండలంలోని బంగారెడ్డిపల్లిలో తన రాత్రి బస కేంద్రానికి చేరిన తర్వాత లోకేష్ పలువురు నాయకులతో సమావేశం నిర్వహించారు. యువగళం విజయవంతమైందని కొందరు నేతలు చెప్పుకురాగా.. కల్పించుకున్న ఓ బీసీ నాయకుడు సభకు ఆశించిన స్థాయిలో జనం రాలేదని పెదవి విరిచాడు. ఇద్దరు నాయకుల వల్ల చిత్తూరులో పార్టీ చచ్చిపోయిందని వ్యాఖ్యానించాడు. నియోజకవర్గ బాధ్యతలను ఇవ్వకపోవడం వల్ల పార్టీని చంపేయడానికి సిద్ధపడారా..? అంటూ లోకేష్ చురకలు పెట్టినట్లు తెలిసింది.

మోటార్‌సైకిల్ దొంగల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రామరాజు


స్వాధీనం చేసుకున్న బైక్‌లు

- 12 బైక్‌ల స్వాధీనం

పుత్తూరు రూరల్: ఆంధ్ర, తమిళనాడులోని పలు ప్రాంతాల్లో మోటర్ సైకిళ్లు అపహరించిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, 12 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పుత్తూరు ఇన్‌చార్జి డీఎస్పీ ఆర్.రామరాజు తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ ముగ్గురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి బైక్‌లను చోరీ చేసేవారన్నారు. సీఐ లక్ష్మీనారాయణ బృందం వేపగుంట క్రాస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారని వెల్లడించారు. విచారించగా పుత్తూరులో 2, బాలాజీపల్లి-2, అరక్కోణం -2, వాలాజా-1, కొండపాళెం-1, షోలింగర్-1, వడమాలపేట-1, తిరుత్తణి-1, తిరువళ్లూరు-1 మొత్తం 12 ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్లు అంగీకరించారని వివరించారు. నిందితులు తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం, అంజూరుపాళెం గ్రామానికి చెందిన పి.బసవయ్య (39), తమిళనాడులని అరక్కోణం మండలం పారంజి గ్రామానికి చెందిన మురుగన్‌మణి(38)గా గుర్తించామని చెప్పారు. . పారంజి గ్రామానికే చెందిన మరో ముద్దాయి శరత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు వెంకటమోహన్, గౌరీశంకర్, ఏఎస్ఐలు బాలసుబ్రమణ్యం, భరత్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

బయోటెక్నాలజీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్‌కు డాక్టర్ కృష్ణ ప్రశాంతి



తిరుపతి తుడా: డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలోని బోర్డ్ ఆఫ్ బయోటెక్నాలజీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్‌లో నాన్–అఫీషియల్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ పెన్నా కృష్ణ ప్రశాంతిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ శుభోకుమార్‌రామ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఈ పదవిలో మూడేళ్లు ఉంటారు. కీలకమైన బయోటెక్నాలజీ రీసెర్చ్ కౌన్సిల్లో డైరెక్టర్ నియమితులు కావడంపై పలువురు వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.